సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.19 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.25
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.25, కనిష్టం రూ.7, సరాసరి రూ.15 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/22.8°
జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పగలంతా ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



ఎస్పీ రత్నకు బొకే అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు

పుట్టపర్తి టౌన్: జిల్లా అదనపు ఎస్పీగా నియమితులైన ఆర్ల శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ రత్నను ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. 1991వ సంవత్సరంలో పోలీస్ శాఖలో ఎస్‌ఐగా చేరిన ఆయన ఎస్‌ఐగా, ఆ తర్వాత సీఐగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పని చేశారు. ఆ తర్వాత డీఎస్పీగా పదోన్నతి పొంది అనంతపురం, కదిరి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పనిచేసి ఇటీవలే పెనుకొండ డీఎస్పీగా వచ్చారు. మరోసారి పదోన్నతి పొంది జిల్లా అదనపు ఎస్పీగా నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు పోలీసు అధికారులు పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆటో - ద్విచక్రవాహనం ఢీ

చెన్నేకొత్తపల్లి: ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో పలువురు కూలీలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... సీకేపల్లి మండలం న్యామద్దెల గ్రామానికి చెందిన పలువురు మహిళా కూలీలు సోమవారం సాయంత్రం 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న పొలంలో పనులు ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. చెన్నేకొత్తపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా పెనుకొండకు చెందిన సంతోష్ అనంతపురము వైపు నుంచి ద్విచక్ర వాహనంలో వేగంగా వస్తూ ఆటోను ఢీకొన్నాడు. ఘటనలో సతీష్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు వెంకటనరసమ్మ, నాగలక్ష్మి, అరుణ, నరసమ్మ, రామాంజినమ్మ, లక్ష్మీదేవి, నరసమ్మతో పాటు ఆటో డ్రైవర్ చంద్రమౌళి గాయపడ్డారు. క్షతగాత్రలను స్థానికులు వెంటనే మరో ఆటోలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



రాప్తాడులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు



పెనుకొండలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ తదితరులు



హిందూపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ సమన్వయకర్త దీపిక తదితరులు

జోహార్ రాజన్నా

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- మహానేతకు ఘన నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నేతలు
- సేవా కార్యక్రమాలు చేపట్టిన పార్టీ శ్రేణులు

పుట్టపర్తి: జనరంజక పాలనతో రైతుకు తోడుగా.. నిరుపేదకు నీడగా..యువతకు దారిచూపే దార్శనికుడిగా.. అవ్వతాతలకు అండగా..దివ్యాంగుల జీవితాల్లో వెలుగు నింపిన దివంగతనేత, మాజీ ముఖ్యమంత్రి, పేదలు ప్రేమగా పిలుచుకునే రాజన్నకు జనం జోహార్లు పలికారు. ఆయన భౌతికంగా దూరమై 15 ఏళ్లు గడిచినా తమ గుండెల్లో ఇంకా కొలువై ఉన్నారని చాటిచెప్పారు. వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు సోమవారం జిల్లా వ్యాప్తంగా జరిగాయి. మహానేత విగ్రహాలకు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వాడవాడలా అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు, నిరుపేదలకు కలిగిన లబ్ధిని కొనియాడారు.

రాజన్న చూపిన బాటలో నడుద్దాం..

నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బాటలో నడిచి ప్రజా సంక్షేమానికి పాటుపడదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం హిందూపురం టీచర్స్‌కాలనీలో వైఎస్సార్ విగ్రహానికి నవీన్‌నిశ్చల్ గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, రాజన్న ఆశయసాధన కోసం నిరంతరం కృషిచేస్తున్న జగనన్న వెంట నడుద్దామని పిలుపునిచ్చారు.



హిందూపురంలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ తదితరులు

హిందూపురంలో..

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు. స్థానిక పరిగి బస్టాండు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ, వైఎస్సార్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఎందరో జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఆ మహానేత భౌతికంగా దూరమైనా ఆయన రూపం మాత్రం ప్రజల గుండెల్లో నిలిచిపోయిందన్నారు.

మడకశిరలో...

మడకశిరలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహానేత వైఎస్సార్ చేసిన సేవలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకున్నారు.

పెనుకొండలో..

మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ పెనుకొండలోని తన స్వగృహంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

కదిరిలో...

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళులు అర్పించారు. మహానేత విగ్రహానికి పుష్పాభిషేకం చేశారు. పేదలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

పుట్టపర్తిలో..

పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని బుక్కపట్నంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అలాగే పుట్టపర్తి పరిధిలోని బ్రాహ్మణపల్లిలోని వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ధర్మవరంలో...

ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నేతలు, అభిమానులు మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు. ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు.

రాప్తాడులో..

రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. రాప్తాడులో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లోనూ అభిమానులు, పార్టీ కార్యకర్తలు వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు.



బుక్కపట్నంలో అన్నదానం చేస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు



మడకశిరలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు



గాండ్లపెంటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త మక్బూల్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా తదితరులు

లోక్ అదాలత్‌కు బ్యాంకర్లు సహకరించాలి

హిందూపురం అర్బన్: ఈ నెల 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌కు సహకరించాలని బ్యాంకర్లు, న్యాయవాదులను జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ కోరారు. లోక్ అదాలత్ నిర్వహణపై సోమవారం స్థానిక జిల్లా అదనపు కోర్టు ఆవరణలో బ్యాంకర్లు, న్యాయవాదులతో సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి లలితాలక్ష్మితో కలసి ఆమె సమీక్షించారు. వివిధ బ్యాంకుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రుణాల రికవరీకి సంబంధించి బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే ఆయా బ్యాంకుల పరిధిలో రాజీ కాదగిన కేసులను లోక్ అదాలత్‌కు సిఫారసు చేయాలన్నారు. న్యాయవాదులు సైతం రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం వల్ల కలిగే మేలును కక్షదారులకు వివరించి, సాధ్యమైనంత ఎక్కువ కేసులను లోక్అదాలత్ వచ్చేలా సహకరించాలన్నారు. సమావేశంలో సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, ఫీల్డ్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకూ గ్రామ సంఘాల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న ఏడాదిలో 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నీతి ఆయోగ్ సహకారంతో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణయించుకుని అన్ని ప్రాథమిక రంగాల అభివృద్ధికి 100 రోజుల ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ధర్మవరం మండలంలో ఓటరు జాబితాకు సంబంధించి ఇంటింటి సర్వే వేగవంతం చేయాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్‌లో నల్లమాడ, గోరంట్ల, కనగానపల్లి, రామగిరి మండలాలు వెనుకపడ్డాయని, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పంట నష్టం నివేదికలు త్వరగా తయారు చేయాలన్నారు. అలాగే ఇప్పటి వరకూ 67 శాతం మందికి ఉపాధి పనులు కల్పించారని వంద శాతం కల్పించాలన్నారు.

'పోలీసు స్పందన'కు 63 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 63 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఫోన్ ద్వారా ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాల సంక్షేమానికి కృషి

జిల్లాలోని పోలీస్ కుటుంబాల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీ రత్న తెలిపారు. సోమవారం ఆమె జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కుటుంబాల్లోని పిల్లల ఉన్నత చదవుల కోసం స్కాలర్‌షిప్‌లు, వైద్యం, ఇంటి స్థలాలు, శాఖా పరంగా అభివృద్ధి పనులు చేపట్టాలని కమిటీ సభ్యులు ఎస్పీని కోరారు. స్పందించిన ఎస్పీ వాటన్నింటినీ పరిశీలించి పోలీసు కుటుంబాలకు మేలు జరిగేలా చూస్తామన్నారు. అనంతరం ఆమె పోలీసు క్యాంటీన్‌ను పరిశీలించారు. పోలీసు అధికారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో న్యాక్ బృందం పర్యటన

హిందూపురం టౌన్: ఈ నెల 5, 6వ తేదీల్లో స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ అసెస్మెంట్ బృందం పరిశీలించనుంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి సోమవారం తెలిపారు. 5న కళాశాల విద్యార్థినుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో న్యాక్ బృందం సభ్యులు సమావేశం కానున్నారు.

'ఓలా'కు రూ.లక్ష జరిమానా

అనంతపురం సెంట్రల్: ఓలా ద్విచక్ర వాహనం రంగు మారుస్తామని తీసుకెళ్లి తిరిగి ఇవ్వని సదరు కంపెనీకి రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా వినియోగదారుల న్యాయస్థానం చైర్‌పర్సన్ శ్రీలత సోమవారం తీర్పు చెప్పారు. అనంతపురానికి చెందిన స్వాతి 2022లో ఓలా యాప్ ద్వారా లిక్విడ్ సిల్వర్ రంగు ఓలా ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేశారు. ఇందుకు రూ. 1.39 లక్షలు చెల్లించారు. అయితే ఎంచుకున్న రంగు బదులు మరో రంగును సరఫరా చేయడంతో.. మార్పు చేయాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. రెండు నెలలకు వాహనాన్ని తీసుకెళ్లిన కంపెనీ ప్రతినిధులు స్టాక్ లేదని చెప్పి కొత్త వాహనం ఇవ్వలేదు. పైగా చెల్లించిన సొమ్ము కూడా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితురాలు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. కంపెనీ ప్రతినిధులు న్యాయస్థానానికి హాజరుకాకపోవడంతో న్యాయస్థానం చైర్‌పర్సన్ ఎం. శ్రీలత, సభ్యులు గ్రేస్ మేరి, గోపినాథ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు చెప్పింది.


వృద్ధుడి బలవన్మరణం

అమరాపురం: రెండున్నర నెలల క్రితం అదృశ్యమైన తమ్మడేపల్లికి చెందిన చన్నప్ప (62) ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది. మద్యానికి బానిసైన చన్నప్ప అందుకు డబ్బు ఇవ్వలేదంటూ తన ఇద్దరు భార్యలతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం తమ్మడేపల్లి శివారులోని ఓ పొలంలోని ఉరికి వేలాడుతున్న అస్థిపంజరాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వగా, పోలీసులు, చన్నప్ప కుటుంబీకులు చేరుకుని పరిశీలించారు. మృతదేహం చెన్నప్పదేనని తేల్చారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ధర్మవరం, పెనుకొండలో జాబ్‌మేళాలు

పుట్టపర్తి అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే నిమిత్తం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ధర్మవరం, పెనుకొండలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతన్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఖయ్యూం తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాబ్‌మేళాలో బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, బీటెక్, పీజీ చదివిన వారు అర్హులన్నారు. అర్హతను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్, రెండు ఫొటోలతో తీసుకురావాలన్నారు. వివరాలకు 9182288465, 9676706976 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

అనంతకు చేరుకున్న క్రికెటర్లు



అక్షర్ పటేల్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, అర్షదీప్ సింగ్

అనంత క్రీడా గ్రామం (ఆర్డీటీ స్టేడియం)లో ఈ నెల ఐదు నుంచి జరిగే దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచుల కోసం పలువురు క్రికెటర్లు సోమవారం రాత్రి అనంతపురం నగరానికి చేరుకున్నారు. స్థానిక సప్తగిరి సర్కిల్లోని ఓ త్రీస్టార్ హోటల్లో బస చేస్తున్నారు. వీరిలో అర్షదీప్ సింగ్, శ్రేయస్ అయ్యర్, రుతురాజ్ గైక్వాడ్, అక్షర్ పటేల్ వంటి అంతర్జాతీయ క్రికెటర్లు కూడా ఉన్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



క్రికెటర్లు బస చేసిన హోటల్ వద్ద అభిమానుల సందడి

అర్జీలన్నింటికీ పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 243 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే అర్జీలన్నింటికీ గడువులోపు పరిష్కారం చూపాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 243 అర్జీలు అందగా, వాటిని ఆయా శాఖలకు పంపారు. అత్యధికంగా రెవెన్యూ, పింఛన్ల మంజూరు, ఇళ్ల స్థలాలు, ఆన్‌లైన్‌లో భూ వివరాల నమోదు, ఆక్రమణల తొలగింపు, పారిశుధ్యంపై ఎక్కువగా అర్జీలు అందాయి. కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటీవల జిల్లాకు వచ్చిన సీఎం చంద్రబాబుకు వివిధ సమస్యలపై పలువురు అర్జీలిచ్చారని, వాటికి తక్షణం పరిష్కారం చూపడంతో పాటు సమగ్ర నివేదిక తయారు చేసి పంపాలని ఆదేశించారు. రోజూ జిల్లాలో ఎంతమేర ఇసుక విక్రయాలు సాగుతున్నాయో వివరాలు అందజేయాలన్నారు. జిల్లాను ఉద్యానవన హబ్‌గా తీర్చిదిద్దడానికి, గిరిజన తండాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తండాల్లో మౌలిక వసతులు, సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ తదితర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే పనులను విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరచాలన్నారు.

ఎమ్మెల్యేకు ట్రైనింగ్ ఇస్తున్నా

- యువత అన్నందుకే నా కోడలిని ముందు పెట్టా
- ఇక్కడ నేనే రాజు.. నేనే మంత్రి



మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి టౌన్: ''ఆమె (ఎమ్మెల్యే సింధూరారెడ్డి) బాగా చదువుకుంది. నాలెడ్జ్ ఉంది. కానీ చిన్న పాపను గెలిపించాము... కాబట్టి ఆమెకు ట్రైనింగ్ ఇస్తున్నా.. దాన్ని కూడా హల్‌చల్ అంటే ఎలా..?.. నేను అనామకుడిని కాదు.. పార్టీ పరంగా అన్నింట్లో కలుగజేసుకుంటా'' అని మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సింధూరారెడ్డిని పక్కన పెట్టి పల్లె రఘునాథరెడ్డి అంతా తానై వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ సోమవారం 'కో'డల్'.. మామ హల్‌చల్' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తీవ్రంగా స్పందించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏ పత్రిక ఏమి రాసినా నియోజకవర్గంలో నేనే రాజు, నేనే మంత్రి.. అదిరేది... బెదిరేది లేదూ అంటూ కుండ బద్ధలు కొట్టారు. తనను చూసే జనం ఓటేశారని, వారి కోసం ఆ మాత్రం కలుగజేసుకోవడం తప్పులేదని సమర్థించుకున్నారు. మాజీ ప్రజాప్రతినిధిని కాబట్టి అధికారులు తనను కలుస్తుంటారని, వారికీ సలహాలిస్తుంటానన్నారు. తన గురించి మరోసారి పేపర్‌లో రాయడం, ఛానళ్లో చూపించడం వంటి పనులు చేస్తే తాను పాత రఘునాథరెడ్డి కాదన్నారు. ఎవరికీ భయపడే ప్రసక్తే లేదన్నారు. అధికారం ఉన్నా... లేకున్నా ప్రజల కోసం పనిచేస్తానన్నారు. అంతిమంగా సింధూరారెడ్డి ఎమ్మెల్యే అయినా... పార్టీ, అధికారిక వ్యవహారాలన్నీ తానే చూసుకుంటానంటూ మరోసారి కాస్త గట్టిగానే చెప్పారు.